Shanti Reading Room
Mirzalouda. Secunderabad

# రాళ్ళ గుట్ట

ఉత్తర దక్షిణాలకి వంతెనగా సాగి, సహృదయుడి దృక్పథంలా విశాలమైన రాస్తామీదుగా ఊరి పొలిమేర చేరి చెరువు కట్టకేసి నడిచాడు ముఖ్య ప్రాణరావు. మూడు రోజుల్నుంచీ ముసురుపట్టి ఆకాశం వాలిపోయి అప్పుడప్పుడే కొద్దికొద్దిగా కోలుకుంటోంది. తొలకరి పలకరిస్తే పులకించి మోసులెత్తినపైరే. కంకెబరువుతో ఊగటంతో, అకాలంలో కురిసిన వర్షాన్ని ఆ సమయంలో వచ్చిన చుట్టంలా చూసి, వంచిన తలెత్తకపోగా ముభావంగా మరింత వంగింది. చిన్న చిన్న గుంటలు నడమంత్రపుసిరికి ఉబ్బి తబ్బిబ్బు లౌతున్నాయి. కొత్తకొత్త పల్లాల్ని వెతుక్కుంటోంది నిలకడలేని నీరు.

చెరువు గట్టుమీదికి చేరి చుట్టూ కలయ చూశాడు ముఖ్య ప్రాణరావు. గట్లని ఒరుసుకుని ప్రవహిస్తోంది నీరు, తలారా స్నానంచేసి తడిపొడి చీర చుట్టుకున్న ప్రకృతి కొప్పునించి నీటి బిందువులు జాలువారుతున్నాయి. వెలసిపోయిన వస్త్రంలా ఉంది ఆకాశం. మబ్బువిడిచి నీరెండ కాస్తోంది. ఎండని కడుగుతూ చిటపట చినుకులింకా పడుతూనే ఉన్నాయి. నీరెండలో తళతళ మెరుస్తూ తటాకంలో లీనమయ్యే ముత్యాల్లాంటి వర్షబిందువుల్ని చూస్తూ సమ్మోహితుడై ఒక్కక్షణం మైమరిచాడు ముఖ్య ప్రాణరావు. విదేశాలలోపర్యటించి అనుభవాల మెరుగులతో, మరింత పెంపొందిన దేశాభిమానంతో, ఉల్లాసంగా వేగంగా మాతృదేశానికి మరలివస్తున్న పౌరుల్లా వర్షబిందువులు చూడ ముచ్చటగా ఉన్నాయనుకున్నాడు ముఖ్య ప్రాణరావు. తనవారి రాకకి తటాకోదకం సంతోషంగా గంతులువేస్తోంది.

ముఖ్య ప్రాణరావు హృదయంలో తెలియని సంతోషమేదో పరవళ్ళు తొక్కింది. చెరువు నీటిలో జారి కరిగి సురిగి పోతున్నాయి వర్షబిందువులు. ప్రతిఒక్క నీటిచుక్కనీ తనలో లీనం చేసుకుంటూ ఇనుమడించిన బల దర్పాలతో ప్రవాహం పొంగిపోతోంది. ఆ నీటి చుక్కలో ఒక చుక్కగా తనూ కలిసి పోతే! కలిసిపోయి ఆ మహాప్రవాహంలో కరిగిపోతే!

"చళ్" మని ఎవరో కొరడాతో కొట్టినట్టయింది ముఖ్య ప్రాణరావుకి.

ఉలిక్కిపడ్డాడు. చుట్టూచూశాడు. ఏమీలేదు. ఏదో వింత అనుభూతి. తను అనుకున్నదేమిటి? ఆ ప్రవాహంలో కరిగిపోవాలనే వింతఊహ తన కెందెకు కలిగింది? ప్రవాహం చీల్చుకుంటూపోయి అవతలి ఒడ్డుకి చేర గల శక్తిసామర్థ్యాలున్నా, ఒక వర్షబిందువై పోవాలనుకున్నాడు. అందంలో ఐక్యమై, అందమై ఆనందం పంచుకోవాలనా? అందరికీ పంచి ఇవ్వాలనా? క్రమబద్ధంగా అలలు అలలుగా సాగిపోతూ ఏ ఆకర్షణతో ఆ గంభీర ప్రవాహం తనని సంభ్రమంలో ముంచెత్తి మంత్రముగ్ధుణ్ని చేస్తోంది? ప్రవాహం! ఆ కదిలేగుణ మేదో తనని పిచ్చివాణ్ని చేస్తుంది. ప్రవాహంలా జనం సాగిపోతుంటే తనూ కలిసేవాడు. ఎక్కడికని ఎప్పుడూ అడగలేదు. అందరిలో తనూ ఒకడు. అందరూ తనవాళ్ళు. ఏదో అనుభూతి. ఏదో ఆవేశం! జనం పొలికేకలుపెడితే ఒళ్ళుమరచి తనూ అరిచాడు. అరిస్తే ఏం లాభమని తనకి అనిపించకపోలేదు. ఆప్రశ్నే ఎవరో అడిగితే కసురుకున్నాడు. విసురుకున్నాడు. తూష్ణీభావంతో చూశాడు. జనం ఎటు తీసుకుపోతే అటు పోయాడు. వాళ్ళ స్వాతంత్ర్యం కావాలని నినాదాలుచేస్తే రెట్టించిన ఉత్సాహంతో తనూ చేశాడు. అందరి కంటే ఎత్తుగా జండా ఎత్తి పట్టుకున్నాడు. పోలీసుల్ని పొమ్మని జనం కేకలు వేస్తే తనూ వారితో కేకలు వేశాడు. వాళ్ళు పోకపోతే జనం రాళ్ళు రువ్వారు. ఒక్కక్షణంమాత్రం తను సంకోచించాడు. రాళ్ళు రువ్వటం దౌర్జన్యం. అదీకాక వాళ్ళ దగ్గిర తుపాకులూ, లాఠీలూ ఉండగా

రాళ్ళతో ఎదుర్కోవటంవల్ల ప్రయోజన మేమిటి? కాని జనం రాళ్ళు రువ్వుతున్నారు. అంతే! తనూ రువ్వాడు. లాఠీచార్జి జరిగింది. జనం పారిపోసాగారు. పారిపోసాగారు, అవును ఏం చేస్తారు. మరి! కాని.... కాని.... తను పారిపోలేదు. ఎందుకు పారిపోవాలి? తను స్వేచ్ఛ కావాలని నిలబడ్డాడు అక్కడ. కదలలేదు. ఆ ఒక్కసారీ జనాన్ని మర్చిపోయాడు. లాఠీచార్జీ చేశారు. నిలబడిన చోటే పడిపోయాడు. అక్కడే ఆ రాళ్ళగుట్ట దగ్గరే, రాళ్ళగుట్ట!

వెంటనే తలెత్తి చూశాడు ముఖ్యప్రాణరావు.

చెరువుగట్టుకి ఒకమూల మూలస్థంభంలా ఎత్తయిన రాళ్ళగుట్ట ఉంది. ఆ గుట్టమీదే జండా నిలిపారు. పోలీసులకి జనానికీ అక్కడే ఘర్షణజరిగింది, ఆ గుట్టలోని రాళ్ళనే జనం విసిరారు. ఆ గుట్టమీదికే ఒరిగి తను పడిపోయాడు. దౌర్జన్యం జరిగింది. ఎవరి ఇష్టంవచ్చినట్టు వాళ్ళు ప్రవర్తించారు. ఫలితం తను అనుభవించాడు. జనంతో తను కలిసీ కలవలేకపోయాడు. దూరంనించి ఎవరో గుంటలో రాయి విసిరితే గుంటదగ్గిర ఉన్నవాడిమీదే నీరు చిందుతుంది. తనూ రాళ్ళు విసిరాడు అనాలోచితంగా. జనం విసరిన రాళ్ళన్నీ చెదురు మదురుగా ఇంకా అక్కడే పడి ఉన్నాయి. తను విసిరినవీ అందులో ఉన్నాయి. అదొక చరిత్రాత్మకస్థలం. ఆ చరిత్రకి ప్రత్యక్షంగా నాటికీ నేటికీ ఆ రాళ్ళగుట్ట నిలిచేఉంది. చరిత్రలో పాల్గొన్న యోధుడిలా గర్వంగా తలెత్తి ఆకాశంలోకిచూస్తోంది. ఆగుట్టను చూస్తున్న కొద్దీ ముఖ్యప్రాణరావుకి ఏదో తీరని అసహనం కలిగింది. ఎందుకో అతనికే తెలియలేదు. తరతరాలనుంచీ అక్కడే పడిఉన్న ఆ గుట్ట పరిసరాల అందాన్ని చెడగొడుతూ ఎబ్బెట్టుగా ఉందనా? లేక దౌర్జన్యంలో పాత్రవహించి ప్రోత్సాహ మిచ్చిందనా? ఏమైనా ఆగుట్టని అక్కడినించి తొలగించాలి. అది తీసివేస్తేగాని చెరువు గట్టుకి అందం రాదు. అదీగాక, ఆగుట్టదగ్గిర చెరువుగట్టు బలహీనంగా ఉంది. పూర్వ

మెప్పుడో అక్కడ గండిపడి పంట యావత్తూ సర్వనాశనమై పోయిందట. అది సరిగా బాగుచేయటం పడనేలేదు. ఇప్పటికే చెరువునిండి నీరు పొర్లుతుంటే గ్రామస్థులకి భయమే, అది బాగు చేయటానికి గుట్ట అడ్డు. ఈ విషయం తను గ్రామస్థులకి నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు. అందరి మేలుకోసం తలపెట్టిన ఈ పనికి తను అనుకోని విధంగా అంతరాయం కలిగింది. అది చరిత్రాత్మకమైనదని. ఎప్పటి చరిత్రో అలాఉంచి, స్వాతంత్ర్య సమరంలో ఆ ఊరిప్రజలు వీరోచితంగా పోరాటం జరిపింది ఆ గు దగ్గిరేననీ, ప్రతి స్వాతంత్ర్య దినోత్సవానికీ ఆ గుట్టమీద జండా ఎగురవేయటం రివాజైందనీ, అందువల్ల ఎప్పటికీ ఆ గుట్ట గ్రామానికీ గర్వకారణంగా అలా ఉండి పోవలసిందేనని కొందరు పట్టుబట్టారు. తన నాయకత్వానికి ఈ విషయం సవాలుగా తీసుకున్నాడు. తను మంచిని అందరూ మంచిగా తీసుకోరేం? ఇందులో తన స్వార్థం ఉందని ఎవరూ అనలేదు. నిజమే. కాని ఎవరి ఇష్టంవచ్చినట్టు వాళ్ళు ఆలోచించి తలో అభిప్రాయం వెలిబుచ్చితే ఎలా?

ముఖ్యప్రాణరావు చికాకుపడ్డాడు. ఈ విషయం చివరికి ఎలా పరిష్కారమవుతుందో తెలియదు. ఆ రాళ్ళగుట్టని చూస్తున్నకొద్దీ తనకి విసుగుదల ఎక్కువవుతోంది. అందులోని రకరకాల రాళ్ళలా రకరకాల మనుష్యులకీ రకరకాల ఆలోచనలు, అభిప్రాయాలు. అసలు జనం ఆలోచించటమేమిటి? ప్రవాహంలా పల్లానికి సాగిపోవాలి ప్రవాహం!

ముఖ్యప్రాణరావు చెరువులోకి చూశాడు. కోట నాలుగువైపులా ముట్టడించిన మహాసైన్యంలా ఉంది గంభీర తటాకోదకం. ప్రతిబిందువూ క్రమశిక్షణ గల సైనికుడిలా ప్రవాహంలో కలిసి అలల వరసలో సాగిపోతూ గటుని ముట్టడిస్తోంది. చరచర ముందుకి సాగే అలల వరసల్ని చూసి ముఖ్యప్రాణరావు ముగ్ధుడయ్యాడు.

ప్రతివర్షబిందువూ కలిసిన బలం !

ప్రతి వర్షబిందువూ సంపూర్ణంగా లీనమై ఇచ్చిన చేయూతనిచ్చాడు. ఎప్పటికి నేర్చుకుంటారు మనుష్యులు ఈ పాఠం ?

ముఖ్య ప్రాణరావు బరువుగా నిట్టూర్పు విడిచి అలల అందం చూస్తూ క్రమంగా తనని తాను మర్చిపోయి ఊహాప్రపంచంలో విహరిస్తున్నాడు. ఐక్యం కాలేక రాళ్ళు దొర్లిపోతున్నాయి. ఐక్యమై అలలు పురోగమిస్తున్నాయి, నీరెండ మరింత పలచబడిపోతుంది.

ఏదో కోలాహలం దూరంలో వినిపించి క్రమంగా దగ్గరైంది. ముఖ్య ప్రాణరావు ఆలోచనల కది అడ్డురాగా వెనుదిరిగి చూశాడు.

జనం, ప్రవాహంలా జనం, పలుగులూ, పారలూ చేతబట్టుకుని హడావిడిగా విసవిస నడుస్తూ వస్తున్నారు. ముఖ్యప్రాణరావు ప్రాణం లేచి వచ్చింది.

ఏమిటి హడావిడంతా ? చివరకి జనం తనదారినే వస్తున్నారా ? ఆలోచనలు మాని తనని అనుసరిస్తున్నారా ? రాళ్ళగుట్టని తవ్వేసి ఆ ప్రదేశాన్ని సుందరతరం చేయటానికే నిశ్చయించుకున్నారా ?

ఉత్సాహంగా ముఖ్య ప్రాణరావు జనంవైపు నడిచాడు. అతన్ని చూసి జనంలో ఎవరో అరిచారు.

"బాబుగారు చెరువుదగ్గిరే ఉన్నారు. భయంలేదు. బతికిపోయాం."

"చెరువెలా ఉందండీ ?" అని మరెవరో అరిచారు.

"చెరువుకేం ? నిక్షేపంగా నిండుకుండలా ఉంది" అన్నాడు ముఖ్య ప్రాణరావు.

"గట్టండి, గట్టు. గట్టుని కోసేస్తుందా ?"

"గట్టా ?" అని ఏదో తప్పుచేసినట్లుగా ముఖంపెట్టి ముఖ్యప్రాణరావు గట్టుకేసి తీక్షణంగా చూశాడు. అతని ప్రాణాలు పైనే పోయాయి.

ప్రవాహం గట్టుని ఉత్సాహంగా కోసేస్తోంది.

అయ్యో! తను వచ్చిన పనేమిటి? ఇందాకటినుంచీ తనేం చేస్తున్నాడు? ఏం ఆలోచిస్తున్నాడు? ముఖ్యప్రాణరావు పిచ్చివాడిలా చేతులు ఊపుతూ అరిచాడు. "రండి, రండి, ప్రవాహం గట్టుని కోసేస్తోంది అడ్డువేయాలి."

జనం త్వరత్వరగా పరుగెత్తసాగారు. ముఖ్యప్రాణరావు కూడా త్వరగా అక్కడికి చేరుకుని ఒక్కసారి పరకాయించి చూశాడు.

ప్రవాహం కసిగా గట్టుని కోసేస్తోంది. గట్టుకింది పొలాలన్నీ సర్వ నాశనమైపోతాయి. మరికొంతసేపు గడిస్తే.

ముఖ్య ప్రాణరావు ముఖం పాలిపోయింది.

చెరువు అందాన్నిచూస్తూ తను ఆనందిస్తూ కాలం వృధాచేశాడు. ఆ జలాన్నిచూసి మురిసిపోయాడు. అందమైన ఒక్కొక్క కత్తిపోటులా గుండెల్లో గుచ్చుకో సాగింది. ప్రతి వర్షబిందువునీ శపించ సాగాడు. తోసుకువచ్చే ప్రవాహంలో ప్రతివర్షబిందువుకీ భాగం ఉంది. ఏ ఒక్క వర్షబిందువుకీ లేని ఔద్ధత్యం, దౌష్ట్యం ప్రవాహానికి సంక్రమించాయి.

"నాకిది ఇష్టంలేదు అయినా నేనేం చేయను?" అని ప్రతి వర్షబిందువూ అసహాయంగా తనవైపు చూస్తూ దీనంగా అంటునట్టుగా ముఖ్యప్రాణరావు అనుభూతి పొందాడు. సానుభూతిగా వర్షబిందువుల్ని తలచుకున్నాడు. కసిగా ప్రవాహంవైపు చూశాడు. ఆవేశంగా రాళ్ళగుట్ట దగ్గరకి పరుగెత్తి బలహీనంగాఉన్న కట్టకి రక్షణగా రాళ్ళని విసిరివేయ సాగాడు. ఇంతలో జనంకలిశారు. ప్రమాదాన్ని గుర్తించి కట్టకి అడ్డంగా రాళ్ళని విసిరివేయ సాగారు. జనం జయించారు. ప్రమాదం తొలగిపోయింది. చిన్న కొండలా అడ్డుపడిన రాళ్ళ గుట్టకి తగిలి అలలు విరిగి పడుతుంటే గట్టుమీద నిలబడి చూస్తూ మందస్మిత వదనుడయాడు ముఖ్యప్రాణరావు. ఆ గుట్టలోతను విసిరిన రాళ్ళూ ఉన్నాయి. తనలాగే జనం తాము విసిరిన రాళ్ళుచూసి

తృప్తిగా ఏదో ఆనందాన్ని అనుభవిస్తున్నారు. గుట్టలో చేరినా కరిగి సురిగిపోని ప్రతిరాయీ తననిచూచి చిరునవ్వు నవ్వుతున్నట్టుగా అనుభూతి పొందాడు. ముఖ్య ప్రాణరావు. చెరువుగట్టున ఆ రాళ్ళగుట్ట అలాగే నిలిచి పోయింది నేటికీ. ఆ ఊరిపేరే రాళ్ళగుట్టగా వ్యవహారమైంది క్రమంగా. ఇప్పటికీ స్వాతంత్ర్య దినోత్సవంనాడు ఆ రాళ్ళగుట్ట మీదే జండా ఎగరవేయటం ఆ ఊరి ప్రజలకి రివాజు.

(1960)

—o—